sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 29-07-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 114 EDITOR: ROHINI



జెన్ జెడ్ @ 38 కోట్లు

2029 ఎన్నికల నాటికి భారీ ఓటర్లు వీరే

2029 సార్వత్రిక ఎన్నికల నాటికి జెన్ జెడ్ జనాభా దేశంలోనే అతిపెద్ద ఓటు బ్యాంకుగా మారుతోంది. గతంలో రాజకీయాలపై ఆసక్తి లేదనే విమర్శలు ఎదుర్కొన్న ఈ కుర్రకారు మిలీనియల్స్ జనాభాను వెనక్కి నెట్టి దూసుకెళ్లింది. ఇంత భారీ ఓటర్ల సంఖ్యతో ఇది దేశంలోనే తిరుగులేని అతిపెద్ద వయోజన జనాజాగా అవతరించనుంది. ప్రస్తుతానికి మన దేశంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న మిలీనియల్స్ జనాభాను ఈ జెన్ జెడ్ సులభంగా వెనక్కి నెట్టేయనుంది.

- సహనం వందే, హైదరాబాద్

- రాజకీయాల వైపు యువత సమర శంఖం
- వీధి పోరాటాల స్థానే డిజిటల్ వరల్డ్ స్ట్రగుల్
- డిజిటల్ నైపుణ్యంతో మారుతున్న పాలిటిక్స్

సరిగ్గా ఇక్కడే అసలు నంబర్స్ గేమ్ మొదలవుతుంది. 2029లో మన దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగే నాటికి ఈ జెన్ జెడ్ జనాభా దేశంలోనే అతిపెద్ద ఓటు వేసే తరంగా మారుతుంది. అంటే ఏ రాజకీయ పార్టీ కూడా ఈ ఓటు బ్యాంకును నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి వస్తుంది. రాబోయే 3 ఏళ్లలో 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల ఈ జనరేషన్ సంఖ్య దాదాపు 38 కోట్ల మందికి చేరుకుంటుంది. మిలీనియల్స్ జనాభా దాదాపు 35.7 కోట్ల మంది వద్ద ఉంటే జెన్ జెడ్ ఆ లెక్కలను తలకిందులు చేస్తోంది.

మంత్రులకూ తప్పని సోషల్ మీడియా బాట

ఈ మార్పు ఎంత తీవ్రంగా ఉందంటే ఇప్పుడు కేంద్ర మంత్రులు సైతం సోషల్ మీడియా బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇన్ స్టాగ్రామ్ లో ప్రత్యక్షమై యువతతో నేరుగా ముచ్చటించడం ప్రభుత్వం ఏం చేస్తోందో వివరించడం ఇప్పుడు అనివార్యమైంది. ఎందుకంటే నిరసనల రూపంలో రోడ్డెక్కడం ఒక్కటే కాకుండా అధికార ప్రతిపక్షాలు ఏ పార్టీ కూడా ఈ యువ శక్తిని విస్మరించలేవనే బలమైన రాజకీయ వాస్తవాన్ని ఇది రుజువు చేసింది. రాబోయే కాలంలో ఏ పార్టీ గెలవాలన్నా ఈ డిజిటల్ కుర్రకారు నాడి పట్టుకోవడం



తప్పనిసరి అయిపోయింది.

యువత రాజకీయ ప్రవేశం

గతంలో మన దేశంలో యువత రాజకీయాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విమర్శలు బలంగా ఉండేవి. కేవలం సోషల్ మీడియాలో సెల్ఫీలు తీసుకోవడం, తమ ప్రపంచంలో తాము బతకడమే వీళ్ల పని అని చాలా మంది పెదవి విరిచారు. కానీ ఇటీవలి కాలంలో జరిగిన కొన్ని కీలక పరిణామాలు ఈ అంచనాలన్నింటినీ తలకిందులు చేశాయి. రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే స్థాయి నుంచి దేశ రాజకీయ వ్యవస్థలోకి ఈ జెన్ జెడ్ దూసుకెళ్లింది. కేవలం వీధులకే పరిమితం కాకుండా ప్రభుత్వ విధానాలనే ప్రశ్నించే శక్తిగా ఎదిగారు.

ఉపాధి విద్యపైనే అందరి చూపు

మరి ఈ భారీ జనాభా ఏయే అంశాలకు పెద్దపీట వేస్తుంది అనే ప్రశ్న వస్తే అక్కడే అసలు కథ ఉంది. ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, నివాస యోగ్యత, వాతావరణ మార్పులు, మెరుగైన పాలన వంటివే వీరికి అత్యంత కీలకం కానున్నాయి. అప్పట్లో కేవలం స్థానిక అంశాల చుట్టూ తిరిగిన రాజకీయాలు ఇప్పుడు ఈ యువత డిమాండ్ల కారణంగా గ్లోబల్, మోడరన్ ఇష్యూస్ వైపు మళ్లక తప్పదు. రేపటి పాలకులను శాసించే ప్రధాన శక్తిగా ఈ అంశాలే మారుతాయి. జెన్ జెడ్ తర్వాత జనరేషన్ ఆల్ఫా రంగప్రవేశం చేయడానికి సిద్ధంగా ఉంది. 2029 ఎన్నికల్లో వీరు ఓటు వేయకపోయినా ఆ తర్వాత టర్న్ వీళ్లదే అవుతుంది. అందుకే రాబోయే రోజుల్లో యువజన సమస్యలు అనేవి కేవలం ఎన్నికల మేనిఫెస్టోలోని కాగితపు మాటలుగా కాకుండా దేశ రాజకీయాలను నడిపే అసలు సిసలు అజెండాగా మారబోతున్నాయి.

డిజిటల్ నైపుణ్యంతో మారుతున్న పాలిటిక్స్

ఈ తగ్గుదల ఒకెత్తైతే జెన్ జెడ్ కి ఉన్న అసలు సిసలైన బలం వారి డిజిటల్ నైపుణ్యమే. వీరికి సోషల్ మీడియానే ప్రపంచం కాబట్టి ఏ చిన్న సమాచారమైనా క్షణాల్లో కోట్లాది మందికి చేరువవుతుంది. ఒక సరైన ఆలోచన లేదా ఒక చిన్న మీమ్ పేజ్ సైతం గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రజా ఉద్యమంగా మారడాన్ని మనం ప్రత్యక్షంగా చూశాము. డిజిటల్ మాధ్యమాల ద్వారా వీరు సృష్టించే నరేటివ్స్ రాజకీయ నాయకుల తలరాతలను మార్చేయగలవు. ప్రస్తుతానికి జెన్ జెడ్ వెనుక ఉన్న ఈ డిజిటల్ పవర్ ఏంటో రాజకీయ పార్టీలకు అర్థమైపోయింది.

స్విగ్గీకి మింత్రా మంత్రం

సీఈవోగా మహిళా లీడర్ నందితా సిన్హా

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థ ఇప్పుడు తన పగ్గాలను ఒక పవర్‌ఫుల్ మహిళా లీడర్ చేతిలో పెట్టింది. ఆన్‌లైన్‌లో బట్టలు కొనుక్కునేలా మ్యాజిక్ చేసిన సెలబ్రిటీ బాస్ ఇప్పుడు టమాటాలు, పాలు మోసే బాధ్యతలను భుజాన వేసుకున్నారు. భారతదేశంలో క్విక్ కామర్స్ రంగం రోజురోజుకూ ఒక రణరంగంలా మారిపోతున్న తరుణంలో ఈ మార్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

- సహనం వందే, హైదరాబాద్

- బట్టల నుంచి సరుకుల అమ్మకం వరకు
- బ్రాండ్ విలువ... మహిళా నాయకత్వం



భారతదేశంలో క్విక్ కామర్స్ రంగం రోజురోజుకూ ఒక రణరంగంలా మారిపోతోంది. మనం అడిగిన 10 నిమిషాల్లోనే కిరాణా సామాను నుంచి గృహోపకరణాల వరకు అన్నీ గుమ్మం ముందుకు వచ్చేస్తున్నాయంటే దాని వెనుక పెద్ద యుద్ధమే జరుగుతోంది. ఈ రంగంలో అగ్రగామిగా ఉన్న స్విగ్గీ సంస్థ తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టామార్ట్ వ్యాపారానికి కొత్త నాయకత్వాన్ని ప్రకటించింది. ఇప్పటివరకు ఈ విభాగాన్ని నడిపించిన అమిటేష్ కుమార్ ఝా తన వ్యక్తిగత కారణాల వల్ల సంస్థ నుంచి మంగళవారం బయట కు వెళ్ళిపోయారు. సరిగ్గా ఆయన స్థానంలోకి ఫ్యాషన్ రంగంలో తిరుగులేని పేరు తెచ్చుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త నందితా సిన్హాను స్విగ్గీ యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ కీలక మార్పు రాబోయే రోజుల్లో క్విక్ కామర్స్ మార్కెట్ రూపురేఖలనే పూర్తిగా మార్చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ఫ్యాషన్ నుంచి కిరాణా రంగం వైపు

నందితా సిన్హా పేరు వినగానే మనకు ముందుగా గుర్తువచ్చేది ప్రముఖ ఫ్యాషన్ ఈకామర్స్ దిగ్గజం మింత్రా. గత కొన్ని సంవత్సరాలుగా మింత్రా సంస్థను సీఈఓ హోదాలో అత్యంత లాభాల బాటలో నడిపించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కేవలం ఫ్యాషన్ మాత్రమే కాకుండా అంతకు ముందు ఫ్లిప్‌కార్ట్, బ్రిటానియా, హిందుస్థాన్ యునిలీవర్ వంటి దిగ్గజ కంపెనీలలో కూడా ఆమె ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మార్కెట్ పోకడలను ముందే పసిగట్టడంలో బ్రాండ్ వ్యూహాలను విజయవంతంగా అమలు చేయడంలో ఆమెది అందెవేసిన చేయి. అందుకే స్విగ్గీ తన అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇన్‌స్టామార్ట్ వ్యాపారాన్ని ఆమె చేతికి అప్పగించింది.

తీవ్రతరమవుతున్న పోటీ

ప్రస్తుతం మన దేశంలో క్విక్ కామర్స్ కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాలేదు... చిన్న పట్టణాలకు కూడా వేగంగా పాకుతోంది. ఒకవైపు బ్లింకిట్, మరోవైపు జెప్టో వంటి కంపెనీలు ఇన్‌స్టామార్ట్‌కు నిద్రలేకుండా గట్టి పోటీ ఇస్తున్నాయి. 10 నిమిషాల డెలివరీ కోసం కస్టమర్లు ఎగబడుతున్న ఈ తరుణంలో లాభాల బాట పట్టడం కంపెనీలకు కత్తి మీద సాములా మారింది. కేవలం వేగంగా డెలివరీ చేయడం మాత్రమే కాకుండా కస్టమర్లకు మరింత నాణ్యమైన సేవలను తక్కువ ఖర్చుతో అందించడం ఇప్పుడు అసలైన సవాల్. ఈ పోటీలో నిలదొక్కుకోవాలంటే కేవలం ఆపరేషన్స్ మాత్రమే కాదు కస్టమర్ సైకాలజీని అర్థం చేసుకునే బలమైన లీడర్ అవసరం. ఫ్యాషన్ రంగంలో వినియోగదారుల నాడీని బాగా పట్టుకున్న నందితా సిన్హా అనుభవం ఇప్పుడు ఇన్‌స్టామార్ట్‌కు ఒక బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

బ్రాండ్ విలువ... మహిళా నాయకత్వం

నందితా సిన్హా కెరీర్‌ను గమనిస్తే ఆమె కేవలం వ్యాపారాన్ని పెంచడమే కాకుండా బ్రాండ్ విలువను కూడా విపరీతంగా పెంచగలరని అర్థమవుతుంది. మింత్రాలో ఆమె పనిచేసిన కాలంలో డిజిటల్ షాపింగ్ అనుభవాన్ని కస్టమర్లకు మరింత సులభతరం చేసేలా అనేక కొత్త టెక్నాలజీలను పరిచయం చేశారు. ఇప్పుడు అదే అనుభవాన్ని కిరాణా సామాను డెలివరీ రంగంలో ఆమె ఎలా వాడుతారనేది చూడాలి. కిరాణా, నిత్యవసర వస్తువుల కొనుగోళ్లలో మహిళల పాత్ర చాలా కీలకం కాబట్టి ఆమె నాయకత్వం మరింత ప్రత్యేకమైన ప్రభావం చూపవచ్చు. మహిళా పారిశ్రామికవేత్తగా ఆమె సాధించిన విజయాలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఇప్పుడు ఆమె భుజాన పడిన ఈ కొత్త బాధ్యత భారతీయ రిటైల్ రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

చెత్త తరం మురికి కూపం

జెన్ జెడ్ తీరుపై నటి కంగనా రచ్చ

- బాధ్యత లేని నేటి యువతరం
- పాశ్చాత్య పోకడల్లో అమ్మాయిలు
- సోషల్ మీడియా మోజు... చదువు క్లోజ్
- తల్లిదండ్రుల కష్టార్జితంతో విలాసాలు
- బాలీవుడ్ నటి జనరేషన్ గట్టర్ వివాదం
- సోషల్ మీడియాలో కంగనా ప్రకంపనలు

స్వేచ్ఛ పేరుతో బాధ్యత మరిచిపోయి విలాసవంతంగా తిరుగుతూ సోషల్ మీడియాలో రీల్స్ చేస్తున్న నేటి తరం యువతను ఉద్దేశించి బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ, సామాజిక వర్గాలలో పెను దుమారాన్ని రేపుతున్నాయి.

- సహనం వందే, న్యూఢిల్లీ

ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా కొద్ది రోజులుగా జరుగుతున్న నిరసనలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు జరిగాయి. అయితే ఈ నిరసనల్లో పాల్గొన్న యువతుల తీరు తెన్నులు, వారు మాట్లాడిన తీరు పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో వీరు చేసిన రీల్స్ చూసిన ప్రముఖ నటి కంగనా రనౌత్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ నిరసనల్లో పాల్గొన్న యువతులను పాశ్చాత్య పోకడలు పోయే భారతీయ యువతులు అంటూ ఆమె అభివర్ణించారు. చదువుల్లో రాణించలేక, అలాగని సంప్రదాయబద్ధంగా ఉండలేక, కేవలం సోషల్ మీడియా మోజులో పడిపోయారని ఆమె ఆరోపించారు. తాము ఏదో పెద్ద ఉద్యమాలు చేస్తున్నామని బిల్డప్ ఇస్తూ అసలు వాస్తవాలకు దూరంగా బతుకుతున్నారని కంగనా విమర్శించారు.

జనరేషన్ గట్టర్ అంటూ తీవ్ర పదజాలం

ఈ తరానికి చెందిన కొందరు అమ్మాయిల ప్రవర్తన చూస్తుంటే కడుపులో వికారం పుడుతోందని కంగనా సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ అంశంపై సుదీర్ఘంగా స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారు ఆశించే స్వేచ్ఛకు, చేసే పనులకు ఎక్కడా పొంతన ఉండటం లేదని ఆమె మండిపడ్డారు. తల్లిదండ్రుల కష్టార్జితంతో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఎలాంటి బాధ్యత లేకుండా బతకడమే నేటి యువత ఫ్యాషన్ అయిపోయిందని ఆమె విమర్శించారు. డ్రగ్స్ వాడటం, ఆల్కహాల్ సేవించడం, తమ వ్యక్తిగత జీవితాల గురించి గొప్పలు చెప్పుకోవడం వంటి వాటినే ఆధునికత అనుకుంటున్నారని ఆమె దుయ్యబట్టారు. ఇతరుల డబ్బులతో విలాసవంతంగా జీవిస్తూ బాధ్యతారహితంగా ప్రవర్తించే వారిని ఉద్దేశించే కంగనా జనరేషన్ గట్టర్ అనే పదాన్ని ఉపయోగించారు.

నిజమైన స్వతంత్ర భావాలు... బాధ్యతలు

నిజమైన స్వతంత్ర భావాలు కలిగిన మహిళలు తమ కాళ్లపై తాము నిలబడతారని, సమాజంలో ఒక బాధ్యతాయుతమైన మార్గాన్ని ఎంచుకుంటారని కంగనా చెప్పుకొచ్చారు. కానీ ప్రస్తుత జెన్-జీ యువతులు మాత్రం ఎలాంటి కష్టం లేకుండా కేవలం సోషల్ మీడియాలో పేరు కోసం మాత్రమే ఇలాంటి నిరసనల్లో భాగమవుతున్నారని ఆమె ఆరోపించారు. తమ కుటుంబాలకు ఏమాత్రం బాధ్యత వహించకుండా కేవలం ఆడంబరాల కోసం బతికేవాళ్లను స్వతంత్రులు అనలేమని ఆమె స్పష్టం చేశారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి అయి ఉండి తోటి యువతపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని కొందరు వాదిస్తుంటే ఆమె చెప్పిన దాంట్లోనూ కొంత వాస్తవం ఉందని మరికొందరు సమర్థిస్తున్నారు. ఈ పదం ప్రస్తుతం రాజకీయంగా, సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేపుతోంది.